# గొడుగు చెప్పిన కథ

**పి.పి. వరప్రసాదరావు**



నేనో గొడుగుని... పుట్ట గొడుగును కాదు. ఎండకు, వానకు మిమ్మల్ని కాపాడే గొడుగుని. ఓ కథ చెప్తాను వింటారా ! నా కథే... అంతా విని ఓ సగటు సుబ్బారావు కథ చెప్పానని మీరంటే అది నా తప్పు కాదు...

ఎన్నాళ్ళయిందో ఆ షాపులో చేరి ఆ షాపు వాడికే తెలియదు. నాసి రకం జాతి గొడుగులం కావడంతో మా బండిలోని కూలీ ఎత్తి క్రింద పడేస్తే నడుం విరిగినా అంత పెద్ద షాప్‌లోకొచ్చి పడ్డందుకు సంతోషం వేసింది. షాపు ఓనర్ అరిచిన అరుపుకు ఓ పదేళ్ళ కుర్రాడు వచ్చి ప్యాకెట్ చించి ఓనర్ మీది కోపమంతా మా మీద చూపించి అందరికీ కనిపించేలా అద్దాల షో కేస్ క్రింది అరలోకి విసిరేశాడు మమ్మల్నంతా.

అలా ఎన్ని రోజులు గడిచాయని - నాకు సరిగ్గా గుర్తు లేదు. ప్రతి రోజూ షాపు తలుపులు తెరుచు కున్నప్పటి నుంచీ రాత్రి పదింటికి షాపు మూసేసే దాకా అలా రోడ్డుకొచ్చే పొయ్యే జనాల్లో ఎవరైనా మా షాప్ కొస్తుంటే ఈసారి అయినా లాటరీ తగలకపో తుందా, నన్నెవరో ఒకరు ఈ షాపు నుంచి తీసుకెళ్ళకపోతారా అని ఆశపడేదాన్ని. అలా ఎదురు చూస్తూనే రోజు గడిచి పొయ్యేది. రాత్రి కాష్ కౌంటర్ దగ్గర డబ్బు లెక్క బెట్టుకునే మా ఓనర్ కేసి కోపంగా చూసేదాన్ని. కానీ అతనికి పైసలు తప్ప మరేమీ పట్టవు. షాపు మూసేసిన తరువాత రాత్రంతా ప్రక్కనున్న వస్తువుల తోను, నా జాతి గొడుగులతోనూ లేని పోని మాటలు మా ఓనర్ మీద కల్పించి చెప్పి గడిపేసేదాన్ని. మధ్యలో ఎప్పుడైనా షాపుకి సెలవొస్తే నా అదృష్టాన్ని పరీక్షించుకుందుకు ఓ రోజు తగ్గిపోయిందని తెగ బాధపడిపోయేదాన్ని. అన్ని గొడుగుల్లా నన్నూ ఈ జైల్లోంచి ఎవరో ఒకరు బయటకెందుకు తీసుకెళ్ళారో అర్థమయ్యేది కాదు. ఈ మనుషులు స్వేచ్ఛ, స్వేచ్ఛ అంటూ తమ బాధ వెళ్ళబోసుకుంటారే గాని నా బాధ ఎందుకు పట్టించుకోరో అర్థమయ్యేది కాదు. మధ్యాహ్నం ఎండకు పూల పూల గొడుగులు అందమైన అమ్మాయిలకు నీడనిస్తూ తలెగరేస్తుంటే వెళ్ళి డొక్కలో ఓ పోటు పొడుద్దామనిపించేది. అప్పుడప్పుడు విసురుగా వీచే గాలికి వాటి గతులు తారుమారైతే నా సంతోషం చెప్పనలవయ్యేది కాదు.

అలా ఈ షాపులో కొచ్చి ఈ పాత అద్దాల షో కేస్ క్రింది అరలో అన్నింటి క్రింద ఓ మూలన పడి నా బ్రతుకు గడుపుతున్నప్పటి నుంచి ఆ సుబ్బారావుని అలా చూస్తూనే ఉన్నాను. అతని బ్రతుకూ, నా బ్రతుకులానే అనిపిస్తుంది. ఉదయం షాపు తెరిచిన అర గంటకు ఠంచనుగా వస్తూ మా షాపుకేసి చూస్తాడా ఈ సుబ్బారావు. కృశించిపోయిన ఆ శరీరానికి చింకిపోవడానికి సిద్ధంగా ఉన్న బట్టలు వేసుకుంటాడు. కాలి చెప్పులు పూర్తిగా అరిగిపోయి చూసేందుకు ఎంత రోతగా ఉంటాయో, కొద్దిగా ఉన్న జుత్తుకు నిండా నూనె పెట్టి, కళ్ళజోడు సరి చేసుకుంటూ, రెండు చక్రాల సైకిల్ మీద ఏవేవో కాగితాలు వేసుకొని మా షాపు పైనే తిరిగి వెళ్తాడతను. షాపు దగ్గరికొచ్చినప్పుడల్లా తన గొడుగుకేసి మా కేసి మార్చి మార్చి చూస్తాడతను. అతని చూపుల్లో అతని ముద్దుల పాత గొడుగు పులకరించిపోయినట్లు ఫీలయ్యేది. ఆ పాత గొడుగు ఎండకు ఎండి వానకు తడిసి రంగంత వెలిసిపోయి ఉండేది. అక్కడా చిరిగిన దగ్గర కుట్టిన బొంతకుట్లు దాచి పెట్టినా దాగేవి కాదు.

మధ్యలో ఏదైనా సెలవు వస్తే అతన్ని చూద్దామన్నా కనిపించేవాడు కాదు. శెలవు ఉన్నా లేకున్నా షాపు మాత్రం తెరిచే ఉంచేవాళ్ళు. ఓ రోజు మంచి వర్షం ముంచుకొచ్చింది. చినుకులు చూడగానే మమ్మల్నంతా దుమ్ము దులిపారు. సరిగ్గా సంవత్సరం క్రితం ఇలాగే దుమ్ము దులిపినా బయటికెళ్ళే అవకాశం మాత్రం దక్కలేదు నాకు. రోజూలానే ఆ సుబ్బారావు కోసం ఎదురు చూస్తున్నాను. మామూలుగా సైకిల్ గుర్తు పట్టి ఆ సుబ్బారావుని గమనించే దాన్ని కాని ఆ రోజు సుబ్బారావు సరాసరి షాపులోకే వచ్చాడు. కలా నిజమా అనిపించింది.

**అంగీరస ఉగాది కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన మొదటి కథ**

"ఏం కావాలి భాయీ సాబ్" అన్న ఓనర్ మాటలకు "ఓ మంచి గొడుగు ఉంటే చూపించండి" - సుబ్బారావు మాటలు తొలిసారిగా విన్నా సా రోజు. పులకరించి పొయ్యాను. ఆ మాటల్లో చేతకానితనం ఉందని అందరూ అనుకుంటారేమో కాని నాకు మాత్రం అణుకువ కనిపించింది. అన్ని గొడుగులతో పాటు నాకూ స్థానభ్రంశం తప్పలేదు. పాపం మంచివాడే... జీవితంతో రాజీపడి సర్దుకుపోయే మనిషి. అసలా హైక్లాస్ గొడుగుల జోలికే పోలేదు. ఇదే సందని హైక్లాస్ గొడుగులన్నీ తమ తమ స్థానాలకు చేరిపొయ్యాయి. మిగిలిన వాటినన్నింటినీ సుబ్బారావు పేరు పేరునా చూశాడు, అయినా అతని ముఖంలో తృప్తి లేదు. వెంట తెచ్చుకున్న పాత గొడుగుని ఓసారి చూసి మాతో పోల్చుకుంటున్నాడు. ఎంత సేపటికీ కొనకపొయ్యేసరికి షాపు ఓనర్ సుబ్బారావుని లోన తిట్టుకుంటూనే పైకి మటుకు "ఆ క్వాలిటీ ఇప్పుడస్సలు రావడం లేదు సార్... ఎప్పుడు తీశారేంటి" అన్న ప్రశ్నకు "నా పెళ్ళికి మా అత్తగారిచ్చారండీ" సుబ్బారావు సమాధానం. "మీ పెళ్ళయి ఎన్నాళ్ళయింది" అన్న ప్రశ్న షాపు ఓనర్ వేస్తాడనుకున్నాను కాని "మీ పిల్లలు పెళ్ళికెదిగి ఉంటారు... ఇప్పుడు అంత క్వాలిటీ ఎక్కణ్ణుంచి వస్తుంది సర్" అన్నాడు. ఇన్ని మాటలు మాట్లాడుతున్నా ఇంత తతంగం జరుగుతున్నా సుబ్బారావుమటుకు ఏదో ఆలోచిస్తూనే ఒక్కో గొడుగును క్రిందికి నెట్టేస్తూ క్రింది గొడుగుల్ని పైకి తీస్తూ చూస్తూనే ఉన్నాడు. మధ్య మధ్యలో నన్నుమటుకు ఆప్యాయంగా చేతిలోకి తీసుకుని "ఇది బావుంటుందంటారా" అంటాడు. ఇంకేం ఓనర్‌కి బూప్ హోల్ దొరికిందిగా" మీ సెలక్షన్ చాలా చక్కగా ఉంటుంది సర్" అంటూ మధ్య తరగతి మనస్తత్వాలకు సులభమైన పరిష్కారం ఇవ్వడం మామూలే. దగ్గరగా తీసుకుని నా గుడ్డకేసి చూస్తుంటే ఏదో గుప్పున వాసన... చెడు వాసన... ఎక్కణ్ణుంచి వస్తుందో అర్థం కాలేదు. నిశితంగా గమనించాను. ఇంకెక్కడిది సుబ్బారావు బట్టల చెమట వాసన. "మరీ ఇంత పిసినారి కాకుంటే బట్టలైనా సరైనవి వేసుకోవచ్చుగా" ముక్కు మూసుకున్నాను. నా ముక్కు తెరిచేందుకు విశ్వ ప్రయత్నం చేసి "ఇదేంటి అసలు తెరుచుకోవడం లేదు" షాపు ఓనర్‌తో నాపై కంప్లైంట్ చేస్తున్నాడు. సంతలో గేదెను చూసి చూసి కొన్నట్లు, ఓ చక్కనింటి అబ్బాయి ఆలోచించి, ఆలోచించి ఓ మంచి నిర్ణయం తీసుకున్నట్లు మార్చి మార్చి చూసి నన్నే సెలక్ట్ చేసుకుని చివరకు రేటు దగ్గరికి వచ్చాడు. "యాభై రూపాయలకు పైసా కూడా తగ్గదు సార్" సుబ్బారావు చూసి చెప్పమంటున్నాడు. ఇక షాపువాడు తగ్గడని నాకు తెలుసు. పోనీ సుబ్బారావు అయినా ఐదేసి చొప్పున పెంచుతూ పైకొస్తాడనుకున్నాను కానీ నలభై దగ్గరే ఆగిపోయాడు.

ఇద్దరికీ మధ్య పది రూపాయలు. ఓ ముష్టివాడు ఓ సెంటర్లో కూచుని రెండు మూడు గంటలలో సంపాదించే దాని కోసం వాళ్ళంతగా వాదులాడుకొంటుంటే నాకు విసుగు పుట్టింది. ముడగదీసుకున్న రెక్కలను మరింత దగ్గరగా లాక్కుంటూ పైన తిరుగుతున్న ఫాన్‌కేసి చూస్తూ కూర్చున్నాను. సుబ్బారావు చేతిలోని పాత గొడుగు నాకేసి చూస్తూ స్నేహ పూర్వకంగా నవ్వింది.

వాళ్ళెలాగూ మాటల్లో పడ్డారని తెలిసి చల్లగా పాత గొడుగుని మాటల్లోకి దించాను. బాగా రాటుదేలింది కదూ, చిత్రంగా సుబ్బారావు చరిత్రంత చెప్పుకుపోతోంది. ఆయన గారు ఓ గుమాస్తానట.



"ఆఫీసులో వసంతే మాటలా అన్నీ సుఖంగా ఉంటాయి కదా" అంటే పాత గొడుగు చెప్పింది కదా, సుబ్బారావు కుర్చీకి ఓ చేయి విరిగిపోయిందట. ఉన్న నాలుగు కాళ్ళలో రెండు అంతంత మాత్రంగా ఉండి కిర్రు కిర్రు మంటుంటాయట. "అయ్యో పాపం అతను పై అధికారులకు ఫిర్యాదు చేయలేదా" అంటే వెళ్ళేం వెళ్తాడుగాని అతన్ని చూడగానే ఏ ఆఫీసరు అయినా కల్పించుకుని ఏదో ఒకటి తిట్టి పంపిస్తారట "అందుకనే బ్రతుకే వెధవదైపోయింది ఇక ఈ కుర్చీలు, టేబుళ్ళు ఏం చేయగలవు" అని సర్దుకుపోవడం మొదలెట్టాడట. చేతకానితనం, బిడియం అతన్ని అలా అశక్తుడిగా మార్చేసిందని కూడా ఆ పాత గొడుగు చెప్పుకొచ్చింది. ఆ పాత గొడుగు సుబ్బారావు వివరాలన్నీ చెపుతుంటే ఇంకాస్త ప్రక్కగా జరిగి చెయ్యి పైన వేస్తూ కొనసాగించమన్నట్లుగా చూశాను.

"పోనీ అతన్ని పెళ్ళయినప్పటి నుంచీ చూస్తున్నావుగా - అప్పుడూ ఇలా ఉండేవాడా" అంటే ఛెంగున ఎగురుతూ పోతున్న ఓ కుర్రాణ్ణి చూపించి ఆ పాత గొడుగు చెప్పడం మొదలెట్టింది. సుబ్బారావు అసలు సచిన్ తెండుల్కార్ అంత చురుగ్గా ఉండేవాడట కానీ గుమాస్తా గిరీలో పడిన తరువాత ఇలా అయిపోయాడట. అప్పటి దాకా గుమాస్తా గిరీ మనిషిలోని చేవనీ, చురుకునీ అన్నింటికీ మించి బుర్రని తినేసి ఒట్టి ఖాళీ టెంకను మిగుల్చుస్తుందన్న సంగతి నాకు తెలియదు. ఆ తరువాత చాలీచాలని జీతాలు, కుటుంబ సమస్యలు, అత్తా కోడళ్ళ తగాదాలు, ముగ్గురైనా, అధికమైన సంతానం, చదువుకొమ్మని పంపితే సినిమాకెళ్ళే కొడుకులు, చిన్నింటి వాళ్ళమన్న సంగతి మరిచి పెద్దింటి వాళ్ళతో ప్రేమ చాటున జరిపే కూతుర్ల ప్రేమాయణాలు, ఆఫీసర్ల చివాట్లు, తోటి స్నేహితుల వెక్కిరింతలు... ఓహ్... అంత తక్కువ సమయంలోనూ ఆ పాత గొడుగు ఎన్నెన్ని విషయాలు చెప్పిందని. కళ్ళలో నీళ్ళు తిరిగి పంట్లోని వేడికి ఆవిరైపోయాయంటే నమ్మండి... అసలు సుబ్బారావుకూ మంచి మంచి ఉద్యోగాలు వచ్చాయట. కానీ చివరి నిముషంలో వాళ్ళు అడిగిన లంచం ఇచ్చుకోలేక... నూటికీ, కోటికీ లంచం లేకుండా వచ్చిన గుమాస్తా ఉద్యోగంలో స్థిరపడిపోయాడట. తొందరపడి పెళ్ళి చేసుకున్నప్పటి నుంచి మొదలయ్యాయట అతని బాధలు...

"పోనీ కట్టుకున్న పెళ్ళాన్ని వాళ్ళు పుట్టింటికి తరిమేసి మామగారిచ్చి పంపించే డబ్బుతోనో, నగలతోనో ఏదైనా పార్ట్‌టైమ్ బిజినెస్ మొదలెట్టవచ్చు కదా" అంటే అసలంత అయిడియా కూడా వస్తుందా, అయినా ఓ విషయం చెప్పనా అని ఆ పాత గొడుగు మెల్లగా నా చెవిలోకి జారవేసిన మాటలు ఇంకా గింగురుమంటూనే ఉన్నాయి.

అంత డబ్బు గల వాడెవడూ చూసి చూసి తన బిడ్డను ఓ గుమాస్తా పీనుగకు తగలకట్టరంట. అసలు సుబ్బారావు మామ కూడా గుమాస్తానట... రేపో మాపో ప్రమోషన్ వస్తుందని చెపితే ఉండబట్టలేక జాతకాలకు, రాశి ఫలాలకు నాలుగు రూపాయలు ఎక్కువగా ఖర్చు చేస్తాడట. అప్పుడు ఆ మాటలు విన్న తరువాత నాకనిపించింది - ఎవరు ఎవరి బాధల్ని గుర్తించినా, గుర్తించకున్నా గుమాస్తాలంటే తోటి గుమాస్తాలకు అభిమానమే బాగుంది అనే సంగతి తెలిసింది.



"ఆత్మ విశ్వాసంతో పని చేస్తే సాధించలేనిది లేదు - అంటూ నువ్వు చెప్పిన మాట పట్టి అబద్ధం నాన్నా!"

"ఎందుకని?"

"నేను దొరకను - అన్న ఆత్మవిశ్వాసంతో కాపీలు రాశాను. కానీ మాస్టారు పట్టుకున్నారు!"

"చివరి మాట సలహా ఎనిమిది ఇచ్చేయ్" షాపు ఓనర్ నన్ను పాత గొడుగు నుంచి దూరం చేసి ప్యాక్ చెయ్యమంటున్నాడు. సుబ్బారావు అంతకీ ఒప్పుకున్నట్లున్నాడు. ఇక నాకు పాత గొడుగుతో పలికే అవకాశం లేకపోయింది. నగం తిన్న గిన్నె ముందు నుంచి లాగేసినట్లనిపించింది నాకు. ఈ బ్రతుకు బాధల్ని కొద్దిగా స్పర్శ చూసిన తరువాత ఆ బాధ సాగరాన మునిగి తేలితేగాని ఆ కష్టం తెలియదు కదా!

అంతా సిద్ధమయి నేనుంటే" మళ్ళీ రేపు వచ్చి తీసుకెళ్తాను" అన్న సుబ్బారావు మాటలకు నాకు మతి పోయినంత పనయ్యింది. అంతా అయిపోయాక అతనెందుకు ఆలస్యం చేస్తున్నాడో అర్థం కాలేదు. మళ్ళీ రేపటి లోపు నిర్ణయం మార్చుకుని నన్ను కొనడం మానేస్తాడేమో అన్న అనుమానం కూడా వచ్చింది. "ఈ గుమాస్తా జీవుల్ని నమ్మలేను, వాళ్ళు అనుకొన్నవి అనుకొన్నట్లు చేయలేరు, వాళ్ళను అనుకొని మాత్రం ఏం లాభం - మన బ్రతుకుల్ని మనం తిట్టుకోవాలి గాని" అని ఆ పాత గొడుగు చెప్పిన మాటలు అక్షర సత్యాలు అనిపించినాయి.

"చాలు చాల్లేవయ్యా గంట నుంచి బిజినెస్ చెడగొట్టేనవ్" యాసలో విదిలించినట్లు షాపతను మాట్లాడుతుంటే ఆ సుబ్బారావులో చలనమే లేదు. కొంచెం సేపాగి షాపు ఓనర్ కోపం తగ్గాక "ఈ రోజు 31 కదా, రేపు జీతాలొస్తాయి" అన్నాడు సుబ్బారావు. అప్పటి దాకా [31] అంటే ఏందో నాకు తెలియదు. ఒకటో తారీకు నుంచి వారం రోజులకే జీతమంతా హారతి కర్పూరంలా అయిపోద్దంట, ఆ తరువాత ఉట్టి విస్తర మంచినీళ్ళేనంట. సుబ్బారావు వెళ్ళిపోయిన తరువాత మా షాప్ ఓనర్ ఎవరితోనో చెపుతుంటే విన్నాను. అయినా ఆ సుబ్బారావు నిజాయితీనీ మెచ్చుకోవలసిందే అంటే "అట్టా మెచ్చుకుంటూపోతే ఈ షాపులో ఏమీ మిగలదు" అని అంటాయి మిగిలిన అన్నదమ్ములైన గొడుగులు. అంతా ఆలోచించి బుర్ర హీటెక్కి ఆ రోజుకు చప్పుడు చేయకుండా నిద్రపోయా.

రాత్రంతా ఒకటే కల... కలలో సుబ్బారావు వచ్చాడు... మునుపటిలా బాధల బరువుని మోయలేక మోస్తూ రాలేదు... నిరాసక్తంగా రాలేదు... ఎగురుతూ ఆనందంగా వచ్చాడు. టక్ చేసి పై కట్టి ఖరీదైన చెప్పులు వేసుకొచ్చాడు. షాపు ఓనర్ హడావుడి చేసి చాయ్ తెప్పిస్తున్నాడు. స్టూల్ తుడిచి కూర్చోబెట్టాడు. రాముల వారి ముందు హనుమంతుడంత వినయం చూపిస్తున్నాడు షాప్ ఓనర్. నాకు పరిస్థితి అయోమయంగా అనిపించింది. సుబ్బారావు ముందుకి నన్ను తీసుకొచ్చారు.

"వాటీస్ దిస్ నాన్సెన్స్ నేను ఆఫీసరుననుకొన్నారా లేక ఆ గుమాస్తా" తరువాతి మాటలు వినిపించలేదు నాకు. ఈ లోపునే సుబ్బారావు నన్ను దూరంగా విసిరేశాడు. ఆ దెబ్బకు తలకు బొప్పికట్టి ఓ కీలు కమ్మీ వంకర పోయింది. నిద్రాభంగమైంది. కల చెదిరిపోయింది.

దిగులుగా ఉదయం కోసం చూస్తూ కూర్చున్నాను. ఉదయం నుంచి సాయంత్రం వరకు అలా ఎదురు చూస్తూనే ఉన్నాను. ఆ రోజు బజారంతా హడావుడిగా ఉంది. నేను ఎప్పుడూ గమనించలేదు. కానీ ఈ రోజు మటుకు ఒకటో తేదీ తడాఖా చూడగలిగాను. ఒకటో తేదీ గురించి విన్న మాటలన్నీ నిజమని తెలిసింది నాకు. సుబ్బారావు కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. అతను తప్పకుండా వస్తాడనిపించింది. ఇక షాపుతో ఋణం తీరిపోతుంది. ఏ పనీ పాటా లేకుండా రోజుల తరబడి ఆ అద్దాల బీరువా అరలో అన్నింటి కంటే క్రిందపడి పైన వేసే వస్తువుల బరువు మోయలేక చచ్చిపోయేదాన్ని.

సాయంత్రానికి ఎక్కడున్న మేఘాలన్నీ ఊరి మీదకు చేరిపోయాయి. సూర్యుడు ఇంకా ఉన్నా చీకటి కమ్మేసింది. మా ఓనర్ ముఖంలో చిరు

## గమనిక

**తేది 12-4-1992** నాటి ఆదివారం అనుబంధంలో ప్రచురించిన శ్రీమతి డి.కౌసల్యాదేవి కథ 'ద్వితీయం' - ఉగాది కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రెండో కథగా గమనించగలరు. తృతీయ బహుమతి పొందిన కథగా ప్రచురితమైనందుకు చింతిస్తున్నాను.

—సంపాదకుడు

